సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం ၊ 24 ၊ మార్చి ၊ 2025



ఆర్టీసీ 'స్పెషల్' ఆదాయం

పశ్చిమగోదావరి జిల్లా ఆర్టీసీ ఐదేళ్లుగా మంచి ఆదాయంతో దూసుకుపోతోంది. ప్రత్యేక సర్వీసుల ద్వారా అధిక ఆదాయాన్ని గడిస్తోంది. 8లో



రికవరీ ఏజెన్సీల మాఫియా?

ఏలూరు కేంద్రంగా ప్రైవేట్ రికవరీ ఏజెన్సీల మాఫియా ప్రజలను భయభ్రాంతులకు పాల్పడుతోంది. పోలీసులమని చెప్పి ఫోన్ చేసి బెదిరిస్తున్నారు. 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం (సాయంత్రం)	సహరి మంగళవారం (ఉదయం)
భీమవరం	6.21	4.44
నరసాపురం	6.22	4.42
తాడేపల్లిగూడెం	6.16	4.52

న్యూస్‌రీల్

హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్‌పోకు సందర్శకుల తాకిడి



స్టాల్స్ తిలకిస్తున్న సందర్శకులు

నరసాపురం రూరల్: రుస్తుంబాద గ్రామంలోని అంతర్జాతీయ లేసు ట్రేడ్ సెంటర్ (ఐఎల్‌టీసీ)లో ఈపీసీహెచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్‌పో ఆదివారం 3వ రోజుకు చేరింది. సెలవురోజు కావడంతో ఉభయ గోదావరి జిల్లాలు, పరిసర ప్రాంతాల నుంచి సందర్శకులు, కొనుగోలుదారులు పోటెత్తారు. దేశ నలుమూలల నుంచి వివిధ హస్తకళల కళాకారులు తమ ఉత్పత్తులతో 70కు పైగా స్టాల్స్ ఏర్పాటుచేశారు. పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, కేరళ, రాజస్తాన్, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి హస్తకళాకారులు తరలి వచ్చారు. హస్తకళాకృతుల విక్రయం, ప్రదర్శనలతో ఐఎల్‌టీసీ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రవేశం ఉచితం కావడం, చిన్నారులు ఆడుకునేందుకు ప్లేగేమ్స్, ఫుడ్‌కోర్టుల ఏర్పాటుతో సందడి నెలకొంది.

పీఎం ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ కోసం అభ్యర్థులు ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన వారికి రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో 550 పరిశ్రమల్లో శిక్షణ ఇస్తారన్నారు. అభ్యర్థుల వయసు 21–24 మధ్య ఉండాలని, ఏడాదికి కుటుంబ ఆదాయం రూ.8 లక్షలలోపు ఉండాలని తెలిపారు. రూ.5 వేల స్టయిఫండ్, ఏక మొత్తంగా రూ.6 వేల ప్రోత్సాహకాన్ని అందిస్తారన్నారు. ఎంపికైన వారికి ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాల కింద బీమా రక్షణ కల్పిస్తారని తెలిపారు.

యువతిపై లైంగిక దాడి.. ఏడుగురిపై పోక్సో కేసు

ఏలూరు టౌన్: ఏలూరులో ఓ యువతిపై లైంగిక దాడికి పాల్పడటంతో పాటు వీడియోలను సోషల్ మీడియాలో పెడతామని బెదిరించిన ఘటనలో ఏడుగురిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. ఏలూరులోని ఓ ప్రాంతానికి చెందిన యువతిని జేపీనగర్‌కు చెందిన ఆళ్ల వంశీకృష్ణ ప్రేమిస్తున్నానని నమ్మించాడు. ఆమెపై గతేడాది ఆగస్టులో లైంగికదాడికి పాల్పడ్డాడు, అలాగే పలుమార్లు అత్యాచారం చేశాడు. తమ వద్ద వీడియోలు ఉన్నాయని, తాము చెప్పినట్టు వినకపోతే సోషల్‌మీడియాలో పెడతామంటూ వంశీకృష్ణ స్నేహితులు ఏనాదుల సాయిచరణ్, చిట్టూరి శివశంకర్ కూడా ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డారు. దీనిపై బాధితురాలి తల్లిదండ్రులు యువకులను నిలదీయగా వారిపై గొడవకు దిగి బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో బాధితురాలు, ఆమె తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించటంతో వంశీకృష్ణ, సాయిచరణ్, శివశంకర్‌తోపాటు రాయి విజయ్, రాయి పావని, ఏనాదుల సింహాద్రి, ఏనాదుల కార్తీక్‌పై ఏలూరు వన్‌టౌన్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

10 వేల మందికి క్యాన్సర్ టీకాలు



మాట్లాడుతున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో సర్వైకల్ క్యాన్సర్ నివారణకు 10 వేల మంది విద్యార్థులకు టీకాలు వేయించనున్నట్టు రోటరీ (3020) జిల్లా గవర్నర్ వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక వైఎంహెచ్ఏ హాల్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోటరీ ఆధ్వర్యంలో వైద్య కళాశాలలో తల్లిపాల స్టోరేజీ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. పోలియో నిర్మూలనకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. గత రెండేళ్లలో చేసిన సేవా కార్యక్రమాలను వివరించారు. క్లబ్ అధ్యక్షుడు ఎన్‌జీవీ స్వామి మాట్లాడుతూ రోటరీ సేవలు మరింత విస్తృతం చేయనున్నామన్నారు. అన్నార్తులకు, దివ్యాంగులకు ఆహారం అందజేస్తామన్నారు. స్థానిక సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ సెంటర్‌లో రోటరీ పీస్ టవర్ నిర్మాణానికి వెంకటేశ్వరరావు శంకుస్థాపన చేశారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ దాకారపు కృష్ణ, జిల్లా సెక్రటరీ కల్యాణ్‌రాజు, రోటరీ పీడీజీ డాక్టర్ పి.దామోదర్ రెడ్డి, డాక్టర్ లలిత పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ చదువులు.. పేద కుటుంబాల్లో వెలుగులు

పేద విద్యార్థులకు వైఎస్సార్ వరం

నూజివీడు క్యాంపస్‌లో 2008 బ్యాచ్ విద్యార్థుల మనోగతం

ముగిసిన మొదటి బ్యాచ్ ఉద్యోగుల సమ్మేళనం

వారంతా పేద, నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు. తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్తేనే కుటుంబ జీవనం సాగుతుంది. ప్రతిభ ఉన్నా ఆర్థిక సహకారం లేక అందుబాటులో ఉన్న విద్యతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. ఇదే సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన హయాంలో ఏర్పాటు చేసిన ట్రిపుల్‌ఐటీలు వారి జీవితాలను పూర్తిగా మార్చేశాయి. పేద వర్గాలకు చెందిన ప్రతిభ గల విద్యార్థులకు చేయందించి.. ఆరేళ్లపాటు రూపాయి ఖర్చు లేకుండా సమీకృత ఇంజనీరింగ్ విద్యను అందించడంతో దానిని అందుకున్న విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కొలువులు సాధించారు. దీంతో ఒకప్పుడు ఆర్థిక కష్టాల్లో ఉన్న వారంతా నేడు పేదరికంలో నుంచి బయటకు వచ్చారు. ఇదంతా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏర్పాటు చేసిన ట్రిపుల్‌ఐటీల వల్లే సాధ్యమైందని పూర్వ విద్యార్థులు ముక్తకంఠంతో చెబుతున్నారు. ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో రెండు రోజుల పాటు నిర్వహించిన తొలి బ్యాచ్ 2008–14 విద్యార్థుల సమ్మేళనం ఆదివారం కూడా ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు నాటి తమ పరిస్థితులను వివరించారు.

– నూజివీడు



నూజివీడు ట్రిపుల్‌ఐటీలో చదువుకున్న 2008 బ్యాచ్ విద్యార్థులు

ట్రిపుల్‌ఐటీతోనే ఈ స్థాయికి..



కాకినాడ రూరల్ మండలం పోలవరం మా ఊరు. మేము నలుగురం అన్నదమ్ములం. తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లేవారు. ట్రిపుల్ ఐటీలో ఉచితంగా చదువుకునే అవకాశం రావడం వల్ల నేనొక్కడినే చదువుకున్నాను. కెమికల్ ఇంజనీరింగ్ పూర్తిచేశా. 2015 నుంచి కోరమాండల్ కంపెనీలో మేనేజర్‌గా చేస్తున్నా. కొత్త ఇల్లు కట్టుకోవడంతో పాటు కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటున్నా.

–కర్రి కోటేశ్వరరావు

వైఎస్సార్‌కు రుణపడి ఉంటాం



ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం బీరంగుంట మా ఊరు. తల్లిదండ్రులు ఇద్దరూ కూలి పనులకు వెళ్తేనే ఇల్లు గడిచేది. కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి 2016 నుంచి కన్యాకుమారిలో న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌లో ఇంజనీర్‌గా చేస్తున్నా. తల్లిదండ్రులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నా. ట్రిపుల్‌ఐటీ లేకపోతే ఏ డిగ్రీనో చదివి ఉండేవాడిని. వైఎస్సార్‌కు రుణపడి ఉంటా.

–మద్దా సురేష్

కొత్త ఇల్లు కట్టుకున్నాం



ప్రకాశం జిల్లా దొనకొండ మండలం భూమానపల్లి మా సొంతూరు. తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లేవారు. రెక్కాడితేనే గానీ డొక్కాడని కుటుంబం మాది. 2008లో ట్రిపుల్‌ఐటీలో సీటు రావడంతో అక్కడే సివిల్ ఇంజనీరింగ్ పూర్తిచేశా. 2017లో మున్సిపాలిటీలో ఏఈఈ ఉద్యోగం వచ్చింది. దీంతో మా ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. ఇప్పుడు కొత్త ఇల్లు కూడా కట్టుకున్నాం. ట్రిపుల్‌ఐటీలో చదువుకోవడం వల్లే మా పేద కుటుంబంలో మార్పు వచ్చింది.

– మురికిపూడి మరియదాసు

ఫీజు కట్టలేని కుటుంబం మాది..



ఏలూరు జిల్లా లింగపాలెం మండలం భోగోలు మా ఊరు. పూరింట్లో ఉండేవాళ్లం. అమ్మానాన్న కూలి పనులకు వెళ్లేవారు. ట్రిపుల్‌ఐటీ అనేది ఒకటి ఉందనే విషయమే తెలియదు. దరఖాస్తు చేయకుండానే సీటు వచ్చింది చేరమంటూ కాల్ లెటర్ వచ్చింది. సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశా. 2020లో ఆర్ఎస్సైగా ఉద్యోగం వచ్చింది. మంచి ఇల్లు కట్టి అమ్మానాన్నలకు బహుమతిగా ఇచ్చా. ట్రిపుల్‌ఐటీ లేకపోతే మా తల్లిదండ్రులు బయటి కాలేజీల్లో చదివించేవారే కాదేమో.

– తాడేపల్లి మౌనిక

వైఎస్సార్‌ని మరువలేం



ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మా సొంతూరు. ఇందిరమ్మ ఇంట్లో ఉండేవాళ్లం. కూలి పనులకు వెళ్తేనే ఇల్లు గడిచేది. ట్రిపుల్‌ఐటీలో ఈసీఈ చేసిన తర్వాత సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశా. ఆ తర్వాత జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో ఎంటెక్ పూర్తి చేశా. 2018లో ఎస్సైగా ఎంపికయ్యా. ఇప్పుడు తెలంగాణ ఇంటలిజెన్స్‌లో పనిచేస్తున్నా. సొంతూరిలో ఇల్లు కట్టుకున్నా. ఆనందంగా బతుకుతున్నాం. వైఎస్ రాజశేఖర్ రెడ్డిని జీవితంలో మరిచిపోలేం.

– చారీ రాంబాబు

ట్రిపుల్‌ఐటీలు వరం



మన్యం జిల్లా మక్కువ మండలం కొండబుచ్చమ్మపేట మా ఊరు. మాది సన్నకారు రైతు కుటుంబం కావడంతో మా అమ్మ, నాన్న వ్యవసాయ పనులు చేసేవారు. ట్రిపుల్‌ఐటీలో సీటు రావడంతో ఈసీఈ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేస్తున్నా. నా చెల్లిని బీటెక్ చదివించా. ఆ తర్వాత పెళ్లి కూడా చేశాను. ట్రిపుల్ ఐటీ లేకపోతే మా కుటుంబ ఆర్థిక స్తోమతకు మా ఇద్దరినీ చదివించే పరిస్థితి కూడా ఉండేది కాదు. ట్రిపుల్‌ఐటీలు మాకు ఒక వరం.

– తిరునగరపు హేమలత

కాపులపై కూటమి వివక్ష

- 10 శాతం ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేయాలి
- కాపు ఐక్యవేదికలో ధ్వజమెత్తిన నేతలు



తణుకులో సంఘీభావం తెలుపుతున్న కాపు ఐక్యవేదిక నాయకులు

తణుకు అర్బన్: కాపుల ఓట్లతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం కాపులపై కుల వివక్ష, సవతితల్లి ప్రేమను చూపిస్తోందని కాపు ఐక్య వేదిక రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ జె.నాగబాబు, ఉత్తరాంధ్ర తెలగ సంఘం చైర్మన్ పి.వెంకట రామారావు విమర్శించారు. ఆదివారం పైడిపర్రు కాపు కల్యాణమండపంలో కాపు ఐక్య వేదిక చైర్మన్ రాలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 2024 ఎన్నికల ముందు ఏదోరకంగా అందలమెక్కాలనే ఉద్దేశంతో పవన్‌కల్యాణ్‌ను అడ్డం పెట్టుకుని కాపుల భావోద్వేగాలను రెచ్చగొట్టి 95 శాతం కాపుల ఓట్లతో అధికారంలోకి వచ్చారన్నారు. అయితే నేడు కాపుల ప్రయోజనాలను పూర్తిగా గాలికొదిలేసి కుల వివక్షను చూపిస్తున్నారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కాపుల ప్రయోజనాలకు సంబంధించి ఏ ఒక్క నిర్ణయం తీసుకోకుండా కుల వివక్ష చూపిందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో కాపు కార్పొరేషన్‌కు ఏడాదికి రూ.3 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి ఇటీవల బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయకపోవడం దుర్మార్గమన్నారు. హైకోర్టు కాపుల విషయంలో సమర్థించిన జీఓ 30 అమలు చేయాలని, మహారాష్ట్ర ప్రభుత్వం మరాఠాలకు కేటాయించిటుగా 10 శాతం ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఈడబ్ల్యూఎస్ 10 శాతం రిజర్వేషన్లను బ్రాహ్మణ, క్షత్రియ, ఆర్యవైశ్య, వెలమ, కమ్మ, రెడ్డి కులాల్లో పేదలకు కొనసాగిస్తే అందరికీ సమన్యాయం జరుగుతుందన్నారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి వర్గాల ప్రయోజనాలను, ఆత్మాభిమానాన్ని, ఆత్మ గౌరవాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు కాపులపై అవలంబిస్తున్న వైఖరిని సత్వరమే మానుకుని అందరికీ సమన్యాయం చేయాలని కోరారు.

సోషల్ జస్టిస్ ఫోరం బీసీ ఐక్య వేదిక వర్కింగ్ చైర్మన్ జంగాల సింగారయ్య యాదవ్, బీసీ ఐక్యవేదిక వర్కింగ్ చైర్మన్ దానా గౌడ్, కాపు ఐక్యవేదిక మహిళా కన్వీనర్ పిడక వెంకటలక్ష్మి, తణుకు మాజీ వార్డు కౌన్సిలర్లు కాకిలేటి సత్యవాణి, కొమ్మిరెడ్డి రమాదేవి, దూలం చిట్టిపాప, కాకిలేటి హరినాథ్, సూర్యసాగర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

31లోపు ఈకేవైసీ పూర్తిచేయాలి

ఏలూరు(మెట్రో): రేషన్ కార్డు లబ్ధిదారులు ఈనెల 31లోపు ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉందని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లను జేసీ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. జిల్లాలో 1,56,000 యూనిట్లకు సంబంధించి ఈకేవైసీ పెండింగ్‌లో ఉందన్నారు. గ్రామ వార్డు సచివాలయాలు, రేషన్ డీలర్ల వద్ద ఈ–పాస్ యంత్రాలు, మొబైల్ యాప్ ద్వారా ఈకేవైసీని అప్‌డేట్ చేయించాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలు మినహా మిగిలిన వారంతా ప్రక్రియను పూర్తిచేయాలన్నారు.

సంరక్షించి.. సాగరంలో విడిచి..



సంరక్షణా కేంద్రంలో పొదిగిన తాబేలు పిల్లలను చూపుతున్న అటవీ శాఖ సిబ్బంది

- సముద్రంలోకి ఆలివ్ రిడ్లే తాబేళ్లు
- తొలిసారిగా 34 తాబేలు పిల్లల విడుదల

నరసాపురం రూరల్: సంతానోత్పత్తి కోసం నరసాపురం మండలం చినమైనవానిలంక ప్రాంతానికి వచ్చి ఆలివ్ రెడ్లీ తాబేళ్లు గుడ్లు పెట్టగా.. గుడ్లను సంరక్షించి పొదిగిన తర్వాత 34 తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో తాబేళ్ల సంరక్షణ, పునరుత్పత్తి కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర ప్రాంతాల్లో కనిపించే ఆలివ్ రిడ్లే తాబేళ్లు ఆహార అన్వేషణ, గుడ్లు పెట్టడం, సంతానోత్పత్తి కోసం వేల కిలోమీటర్లు ప్రయాణించి ఇక్కడికి వస్తున్నాయి. అలా వచ్చి తీరంలో గుడ్లు పెడుతుండగా అటవీ శాఖ అధికారులు వాటిని సంరక్షిస్తున్నారు. ఫిబ్రవరి 3న తొలిసారిగా గుర్తించిన తాబేళ్ల గుడ్ల నుంచి పిల్లలు బయటకు రాగా ఆదివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో సముద్రంలోకి విడిచి పెట్టారు. సంరక్షణ కేంద్రంలో ఇప్పటివరకూ 135 తాబేళ్లు పెట్టిన 14,300 గుడ్లు సేకరించి భద్రపరిచినట్టు సిబ్బంది తెలిపారు. తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టే కార్యక్రమంలో ఫారెస్టు బీట్ ఆఫీసర్ కె.రాంప్రసాద్, తాబేళ్ల సంరక్షణా పునరుత్పత్తి కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



సముద్రంలోకి వెళుతున్న తాబేలు పిల్లలు

ధరపైనే ఆశలన్నీ..

- నేటినుంచి పొగాకు కొనుగోళ్లు
- ఐదు వర్జీనియా కేంద్రాల్లో వేలం
- ప్రారంభ ధర పెంచాలని రైతుల డిమాండ్



జంగారెడ్డిగూడెం : వర్జీనియా పొగాకు రైతులు ధరపైనే ఆశలు పెట్టుకున్నారు. గతేడాది రికార్డు స్థాయిలో కేజీ ధర రూ.411 లభించగా, సరాసరి ధర రూ.335 పలికింది. దీంతో ఈ ఏడాది ధరపైనే ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎన్ఎల్ఎస్ (ఉత్తర ప్రాంత తేలిక నేలలు) పరిధిలో జంగారెడ్డిగూడెం–1,2, కొయ్యలగూడెం, దేవరపల్లి, గోపాలపురంలో వర్జీనియా పొగాకు వేలం కేంద్రాలు ఉన్నాయి. సుమారు 12,500 మంది రైతులు వర్జీనియా సాగు చేస్తున్నారు. గతేడాది దేశీయంగా, అంతర్జాతీయంగా పొగాకుకు విపరీతమైన డిమాండ్ రావడంతో మంచి ధర లభించింది. ఈ ఏడాది కూడా అంతకు మించి ధరలు వస్తాయని రైతులు భావిస్తున్నారు.

ఎస్ఎల్ఎస్ పరిధిలో పంటకు డిమాండ్

జిల్లాలోని 5 వేలం కేంద్రాల్లో సోమవారం నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఎస్ఎల్ఎస్ (దక్షిణ ప్రాంత తేలిక నేలలు) వేలం కేంద్రాల పరిధిలో పొగాకు ప్రారంభ ధర కేజీ ఒక్కింటికీ రూ.280 లభించింది. దీంతో ఎన్ఎల్ఎస్‌లో కేజీ ప్రారంభ ధర రూ.340 వరకు లభిస్తుందని రైతులు అంటున్నారు. ఎన్ఎల్ఎస్ పరిధిలో పండే వర్జీనియా పంట సిగరెట్ తయారీలో సుగంధ ద్రవ్యంగా వినియోగిస్తారు. దీంతో ఈ పొగాకుకు డిమాండ్ అధికం. గతేడాది ప్రారంభ ధర కేజీ ఒక్కింటికి రూ.240, సగటు ధర రూ.335 పలికింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ప్రారంభ ధర రూ.340 ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. గతేడాదితో పోల్చితే భూములు, కౌలు ధరలు, బ్యారన్ కౌలు ధరలు, క్యూరింగ్ ఖర్చులు, కూలీల ఖర్చులు పెరిగాయని రైతులు అంటున్నారు.

ప్రారంభ ధర పెంచాలి



ప్రారంభ ధర కేజీ ఒక్కింటికీ రూ.340 ఇవ్వాలి. గతేడాది సరాసరి ధర రూ.335కు రూ.5 పెంచి ప్రారంభ ధర ఇవ్వాలి. దీనిపై పొగాకు బోర్డు, ఐటీసీ అధికారులతో ఇప్పటికే మాట్లాడాం. అధికారులు, కంపెనీల ప్రతినిధులు ఈ అంశాన్ని పరిశీలించి రైతులను ఆదుకోవాలి.

– పరిమి రాంబాబు, వర్జీనియా పొగాకు రైతు సంఘం నాయకుడు

గతేడాది మంచి ధర



గతేడాది మంచి ధర లభించింది. సూపర్ మార్కెట్‌గా నమోదైంది. ఈ ఏడాది పెట్టుబడులు బాగా పెరిగాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రారంభ ధర పెంచాలి. అలాగే సరాసరి ధర కూడా మంచి రేటు వచ్చేలా అందరూ నిర్ణయం తీసుకుని రైతులను ఆదుకోవాలి.

– కరాటం రెడ్డిబాబు, వర్జీనియా పొగాకు సంఘం రైతు నాయకుడు

మంత్రి ఇలాకా.. పారిశుద్ధ్యం ఇలాగా..?

నూజివీడు పట్టణంలో పారిశుద్ధ్యం అడుగడుగునా అధ్వానంగా తయారైంది. రాష్ట్ర మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గమే కాకుండా, ఐఏఎస్ అధికారి సబ్ కలెక్టర్‌గా ఉండగా పారిశుద్ధ్యం ఇలాగేనా ఉండేదని పట్టణ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు దాదాపు 150 మంది ఉన్నా పారిశుద్ధ్యం దిగజారుతోంది. రోజుకు 30 టన్నుల చెత్త నూజివీడులో ఉత్పత్తి అవుతుండగా, ఆదివారం వస్తే కేవలం కొన్ని ప్రధాన రహదారుల్లోని చెత్తను మాత్రమే తొలగిస్తూ మిగిలిన పట్టణమంతా వదిలేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర అంటూ ప్రచారార్భాటం తప్పితే క్షేత్ర స్థాయిలో మాత్రం జరిగేది శూన్యమనే విమర్శలు వినిపిస్తున్నాయి. పన్నుల వసూళ్లపై చూపుతున్న శ్రద్ధను మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్యం మెరుగుపరచడంలో చూపించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

– నూజివీడు



నూజివీడులో ఎన్నెస్పీ గేటు వద్ద..



నూజివీడు ఏరియా ఆసుపత్రి వద్ద..



సుతార్ల రామమందిరం ఎదురు రోడ్డులో..

క్లుప్తంగా

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు ప్రదానం



తెలుగు బుక్ ఆఫ్ ఐకాన్ అవార్డు అందుకుంటున్న బోనగిరి రమేష్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మోదుగగుంట గ్రామానికి చెందిన బోనగిరి రమేష్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఐకాన్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నారు. ఆర్యవైశ్య సంఘంలో కీలకంగా వ్యవహరిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాల్లో ముందుంటున్న రమేష్ సేవలను గుర్తించి, ఈ అవార్డు ప్రదానం చేశారు.

48 మద్యం సీసాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

ఆగిరిపల్లి: అక్రమంగా నిల్వ ఉంచిన 48 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శుభశేఖర్ తెలిపారు. మండలంలోని తోటపల్లిలో ఆరేపల్లి వేణుగోపాల్ అనే వ్యక్తి అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్నాడనే సమాచారంతో ఆదివారం సిబ్బందితో కలిసి దాడి చేసి అతని వద్ద ఉన్న 48 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. మండలంలో ఎవరైనా అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రాట్నాలమ్మకు రూ.1,26,343 ఆదాయం



ప్రత్యేక అలంకరణలో శ్రీ రాట్నాలమ్మ తల్లి

పెదవేగి: భక్తుల తాకిడితో రాట్నాలమ్మ అమ్మవారి దేవస్థానం కిటకిటలాడింది. పెదవేగి మండలం రాట్నాలకుంట గ్రామంలో వెలసిన రాట్నాలమ్మ తల్లికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించారు. ఈ వారం అమ్మవారికి పూజారుసుంలతో రూ.60,850, విరాళాలుగా రూ.36,493, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.27,000, ఫొటోల అమ్మకం వల్ల రూ.2,000 ఆదాయం లభించగా, మొత్తం ఆదాయం రూ.1,26,343 లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు.

ఆర్టీసీకి స్పెషల్ ఆదాయం

- ఐదేళ్లలో ప్రత్యేక సర్వీసుల ద్వారా రూ.5 కోట్ల రాబడి
- ఈ ఏడాది సంక్రాంతికి రూ.99.30 లక్షల ఆదాయం
- పండగలు, యాత్రలకు ప్రత్యేక సర్వీసులతో ప్రైవేటు దందాకు చెక్



భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లా ఆర్టీసీ గత ఐదేళ్లుగా మంచి ఆదాయంతో దూసుకుపోతోంది. పండుగలకు, తీర్థ యాత్రలకు ప్రత్యేక బస్సులు నడుపుతూ మంచి ఆదాయాన్ని ఆర్జిస్తోంది. జిల్లాలోని భీమవరం, నర్సాపురం, తణుకు, తాడేపల్లిగూడెం డిపోల నుంచి ఏటా సంక్రాంతి, దసరా పండగలతోపాటు కార్తీక మాసంలో, అరుణాచలం తదితర తీర్థ యాత్రలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. టికెట్ ధరలు పెంచకుండా సాధారణ ధరలకే ఈ ప్రత్యేక బస్సులు నడపడం ద్వారా ప్రజలకు ఆర్టీసీ బాగా చేరువైంది.

రికార్డు స్థాయిలో ఆదాయం

గత ఐదేళ్లుగా ఆర్టీసీ మంచి ఆదాయాన్ని సాధించింది. 2020లో ఏడాదికి రూ.48 లక్షల ఆదాయం సాధించగా.. 2024 నాటికి ఏడాదికి రూ.కోటి ఆదాయం ఆర్జించే స్థాయికి చేరింది. ఏటా సంక్రాంతికి ఆర్టీసీకి మంచి ఆదాయం వస్తోంది. సంక్రాంతి పండుగకు హైదరాబాద్ నుంచి జిల్లాకు.. జిల్లా నుంచి హైదరాబాద్‌కు పది రోజుల పాటు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి రికార్డు స్థాయిలో రూ.99 లక్షల ఆదాయాన్ని సాధించింది. ఈ ఏడాది పంచారామాల ప్రత్యేక బస్సు సర్వీసులు నాటికి ఆర్టీసీ ఆదాయం రూ.1.50 కోట్లు దాటనుంది.

ప్రైవేటు బస్సుల దందాకు చెక్

పండుగ సీజన్లు తీర్థయాత్రలకు ప్రైవేటు బస్సుల యాజమాన్యం ఇష్టానుసారంగా టిక్కెట్ ధరలు పెంచి ప్రజలను దోపిడీ చేసేవి. దాంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులతో టిక్కెట్ ధర సామాన్యుడికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రయాణికుల రద్దీకి తగ్గట్టుగా ప్రత్యేక బస్సుల ఏర్పాటుతో ఆర్టీసీ బస్సులు ఎక్కేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. వారు కోరుకున్న తీర్థయాత్రలకు కూడా ప్రత్యేక బస్సులను ఏర్పాటు వల్ల ప్రైవేటు బస్సుల టిక్కెట్ దందాకు చెక్ పెట్టారు.

పశ్చిమగోదావరి జిల్లా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసుల ద్వారా గత 5 ఏళ్ల నుంచి రూ.5 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. కరోనా విపత్తు రెండేళ్లలో కూడా సంక్రాంతి, దసరా, ఇతర తీర్థ యాత్రలకు కూడా ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపారు.

గత ఐదేళ్లలో ప్రత్యేక సర్వీసుల ఆదాయం

ఏడాది	సంక్రాంతికి (రూ.లక్షల్లో)	ఇతర సర్వీసులు (రూ.లక్షల్లో)
2020	36.93	11.80
2021	36.88	28
2022	54.62	30
2023	60	35
2024	70	40
2025	99.51	

ప్రత్యేక బస్సులతో మంచి ఆదాయం



పండగలు, తీర్థ యాత్రలకు, దైవ దర్శనాలకు జిల్లాలోని 4 డిపోల నుంచి ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక సర్వీసుల ద్వారా మంచి ఆదాయం లభిస్తుంది. పశ్చిమగోదావరి జిల్లా ఆర్టీసిని జిల్లా ప్రజలకు మరింత చేరువ చేసేలా టిక్కెట్ ధరలు పెంచకుండానే అన్ని పండుగలకు బస్సులు ఏర్పాటు చేసి క్షేమంగా గమ్య స్థానాలకు చేరుస్తున్నాం. సంక్రాంతి, దసరా పండుగలకు హైదరాబాద్ నుంచి జిల్లాకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం.

– ఎన్వీఆర్ వర ప్రసాద్, జిల్లా ప్రజా రవాణాశాఖాధికారి

రికవరీ ఏజెన్సీల మాఫియా?

ఏలూరు టౌన్: ఏలూరు పత్తేబాద ప్రాంతానికి చెందిన రామసీత ఒక ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పర్సనల్ లోన్ తీసుకున్నారు. నాలుగేళ్లుగా కడుతూ ఉండగా ఆరు నెలలుగా ఈఎంఐ చెల్లించకపోవడంతో బకాయి పడింది. రామసీతకు ఇటీవల ఒక ఫోన్ వచ్చింది. అమరావతి నుంచి సీఐను మాట్లాడుతున్నాను. మీపై హైకోర్టులో కేసు వేస్తున్నారు. మీ ఇంటికి గంటలో పోలీసు జీపు వస్తుంది. మిమ్మల్ని చెక్‌బౌన్స్ కేసులో అరెస్ట్ చేస్తారు అంటూ బెదిరించారు. కొంతసేపటి తర్వాత పత్తేబాద సచివాలయానికి చెందిన ఒక మహిళా పోలీసు (మహిళా సంరక్షణ కార్యదర్శి) రామసీత ఇంటికి వచ్చి మీరు పర్సనల్ లోన్ తీసుకున్నారని.. మీపై చెక్‌బౌన్స్ కేసు పెట్టారని.. వెంటనే సంబంధిత ఏజెన్సీ వాళ్లతో మాట్లాడుకుని బకాయి డబ్బులు కట్టకపోతే.. పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్తాం.. అంటూ వార్నింగ్ ఇచ్చారు.

దుగ్గిరాల ప్రాంతానికి చెందిన కలగంటి గోవింద్ కొంతకాలం క్రితం ప్రైవేటు ఫైనాన్స్‌లో రుణం తీసుకున్నాడు. ఇటీవల అతనికి రోడ్డు ప్రమాదానికి గురికావడంతో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో ప్రైవేటు ఏజెన్సీ వ్యక్తులు అతడిని కలిసి నీకు బీమా వస్తుంది.. కొంత కడితే ఇంక లోన్ కట్టాల్సిన పనిలేదని కొన్ని పత్రాలపై సంతకాలు చేయించుకున్నారు. కొద్దిరోజుల క్రితం థర్డ్‌పార్టీ ఏజెన్సీ పేరుతో సీఐ అంటూ ఫోన్ చేసి డబ్బులు కట్టాలని, రూ.1.80 లక్షలు చెల్లించకుంటే చెక్‌బౌన్స్ కేసు నమోదు చేస్తామని, అల్లరి చేస్తామని, బెయిల్ కూడా రాదంటూ బెదిరింపులకు పాల్పడ్డారు.

- పోలీసుల పేరుతో భయభ్రాంతులు
- సచివాలయ సిబ్బందిని వినియోగిస్తున్న వైనం
- ఏలూరులో రెండు చోట్ల తాత్కాలిక ఆఫీసులు?
- 9 మందిపై కేసు నమోదు



తీగలాగితే డొంక కదిలింది

ఏలూరు జిల్లా చింతలపూడి ప్రాంతంలోని ఒక సచివాలయంలో పనిచేస్తున్న మహిళా పోలీసుకు ఫోన్ కాల్ వచ్చింది. తాను ఏలూరు నుంచి సీఐ నాగరాజును మాట్లాడుతున్నానని.. చింతలపూడిలోని ఒక వ్యక్తికి చెందిన ఆధార్, పాన్‌కార్డ్ అతని పూర్తి వివరాలు వాట్సప్‌లో ఇవ్వాలని చెప్పాడు. ఆమెకు అనుమానం రావడంతో ఏలూరులోని పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చింది. తీగ లాగితే.. మొత్తం డొంక కదిలింది. ఏలూరు శాంతినగర్‌లో థర్డ్ పార్టీ ఏజెన్సీ పేరుతో ఒక కార్యాలయాన్ని నడుపుతున్న ముఠా దొరికింది. జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన సీసీఎస్ పోలీసులు, ఏలూరు త్రీటౌన్ పోలీసులు కార్యాలయంపై మూడు రోజుల క్రితం దాడి చేశారు. పత్తేబాద రోడ్డులోనూ ఇదే తరహా ప్రైవేటు ఏజెన్సీ కార్యాలయాన్ని పోలీసులు తనిఖీ చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నట్లు సమాచారం.

ప్రైవేటు ఏజెన్సీ మాఫియా

ఫైనాన్స్ కంపెనీలు రుణాల రికవరీకి థర్డ్‌పార్టీ ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగిస్తుంది. ఈ నేపథ్యంలో ఏలూరు కేంద్రంగా ప్రైవేటు ఏజెన్సీ మాఫియా జనాలను పోలీసుల పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఈ ఏజెన్సీలో ఏలూరుకు చెందిన ఆరుగురు వ్యక్తులు, తిరుపతికి చెందిన ఇద్దరు, బెంగుళూరుకు చెందిన మరో ఇద్దరు కీలక పాత్రధారులుగా ఉన్నట్లు గుర్తించారు. ఏలూరుకు చెందిన గడ్డం కిషోర్ అలియాస్ నాగరాజు, మధ్యాహ్నపు వంశీకృష్ణ, ప్రవీణ్‌కుమార్, రియాజ్, వెంకట్, ఇబ్రహీం, మరో నలుగురిపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మొత్తంగా ఈ ఏజెన్సీ ముఠాలో 10 మందికి పైగా ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రమాదంలో ప్రజల వ్యక్తిగత సమాచారం?

ప్రైవేటు ఏజెన్సీల పేరుతో సాగుతున్న దందాతో ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు. పోలీసుల పేరుతో ఏకంగా సచివాలయ ఉద్యోగులను సైతం ప్రభావితం చేస్తూ ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించడం చూస్తే .. వ్యక్తిగత గోప్యత ప్రమాదంలో పడినట్లవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక నకిలీ పోలీసులే ఈ వ్యవహారాన్ని నడుపుతున్నారా ? లేక నిజంగానే ఎవరైనా పోలీస్ అధికారులు ఈ ఏజెన్సీలకు అండగా నిలుస్తున్నారా? అనేది సందేహంగా మారింది. జిల్లా వ్యాప్తంగా ఇదే తరహాలో ప్రైవేటు ఏజెన్సీల ఆగడాలు సాగుతున్నా పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు వాపోతున్నారు.



పెద్దింట్లమ్మ దేవస్థానంలో భక్తుల రద్దీ



పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద వంట షెడ్ల వద్ద భక్తులు

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. ఈ నెల 13తో అమ్మవారి జాతర మహోత్సవాలు ముగిసినప్పటికీ ఈ నెల చివరి వరకు భక్తులు ఎక్కువగా అమ్మవారిని దర్శించుకుంటారు. ఆదివారం కావడంతో సమీప జిల్లాల నుంచి భక్తులు అమ్మను దర్శించుకున్నారు. వేడి నైవేద్యాలు సమర్పించారు. జాతరకు ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో భక్తులు వంటలు చేసుకుని భోజనాలు చేశారు. దేవస్థానంలో క్యూ లైన్లు నిండాయి. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ ఆదివారం ఒక్కరోజు ప్రత్యేక, అంతరాలయ దర్శనాలు, కేశఖండనశాల, పెద్ద, చిన్న తీర్థాలు, లడ్డు ప్రసాదం, గదుల అద్దెలు, చిత్రపటాల అమ్మకం, అమ్మవారికి కానుకల ద్వారా రూ.2,92,056 ఆదాయం వచ్చిందని తెలిపారు.

అంబేడ్కర్‌ను అవమానించిన వారిని శిక్షించాలి



పిప్పరలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మాలమహానాడు నాయకులు

గణపవరం: తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్లలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం గణపవరం మండలం పిప్పరలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాలమహానాడు జాతీయాధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతగా ప్రపంచ దేశాలు మేధావిగా కొనియాడిన బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించడం భారత రాజ్యాంగాన్ని అవమానించడమేనన్నారు. పేద, దళిత, నిమ్న జాతుల గుండెల్లో కొలువైఉన్న అంబేడ్కర్‌ను ఎవరు అవమానించినా సహించేదిలేదన్నారు. దళితుల మధ్య ఉన్న ఐక్యతను చెడగొట్టి వారి మధ్య విభేదాలు సృష్టించడానికి పాలకులు చేస్తున్న ప్రయత్నాల కారణంగానే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు చోడదాసి జైపాల్, సబ్బితిరాజు, నీతిపూడి వెంకటేశ్వర్లు, ప్రసన్నకుమార్, వెన్నపుచంటి, బీర త్రిమూర్తులు, సారధి, మోహనరావు, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

నిట్‌లో ఉత్సాహంగా మారథాన్



ఏపీ నిట్‌లో మారథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరుగు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ కె.హిమబిందు సూచించారు. నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎన్వీ రమణారావు ఆధ్వర్యంలో సంస్థలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ క్లబ్ సహకారంతో ఆదివారం నిర్వహించిన మారథాన్ కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగింది. ఈ సందర్భంగా డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యానికి వ్యాయామం, పరుగు, నడక, యోగా వంటివి ఎంతగానో దోహదం చేస్తాయని వీటి సాధన కోసం విద్యార్థులు నిత్యం కొంత సమయాన్ని కేటాయించాలని వివరించారు. అనంతరం నిట్ ముఖద్వారం నుంచి బాలికల వసతి గృహాల వరకు, అక్కడి నుంచి తిరిగి మళ్ళీ నిట్ ముఖద్వారం వరకు మారథాన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ టి.జగన్మోహన్‌రావు, శారదా ప్రసన్న మాలిక్, సుశాంత్ కుమార్, బెహరా తదితరులు పాల్గొన్నారు.

హైవే మొబైల్ వెహికల్స్‌కు జీపీఆర్ఎస్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలతో ఏలూరు పోలీసు శాఖలోని హైవే మొబైల్ వాహనాలకు జీపీఆర్ఎస్ అమర్చినట్లు ఏలూరు డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఏలూరు జిల్లాలో రహదారి భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని.. ఈ నేపథ్యంలో సిబ్బంది సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించుకునేందుకు జీపీఆర్ఎస్ ట్రాకింగ్ సిస్టమ్ అమర్చినట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఏలూరు జిల్లాలోని 8 హైవే మొబైల్ వాహనాలకు జీపీఆర్ఎస్ ఏర్పాటు చేశామని చెప్పారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ హైవే మొబైల్ వాహనాలను పర్యవేక్షించటంతోపాటు ఏదైనా అత్యవసర సమయాల్లో తక్షణమే స్పందించేలా అవకాశం లభిస్తుందని డీఎస్పీ చెప్పారు. సిబ్బందికి రేడియం జాకెట్లు, బేటన్స్ అందజేశామని, మరింత సౌకర్యాలు కల్పిస్తూ విధులు సక్రమంగా నిర్వర్తించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. జాతీయ రహదారుల్లో మద్యం సేవించి వాహనాలు నడపటం, మితిమీరిన వేగంతో వెళ్ళే వాహనాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు చేపట్టేలా శ్రద్ధ వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఏదైనా అత్యవసర సమయాల్లో హైవే మొబైల్, పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 83329 59175 లేదా డయల్ 112కు ఫోన్ చేయాలని ఏలూరు డీఎస్పీ సూచించారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్

పెనుగొండ: మండలంలోని తామరాడలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని, ఆరు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు. ఆదివారం జరిగిన ఈ దాడిలో గుబ్బల జ్ఞానేశ్వరరావు(50)ను అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. దాడుల్లో ఎస్సై ఆర్ మధుబాబు, హెచ్‌సీ శ్రీమన్నారాయణ, కానిస్టేబుల్ నాగరాజు పాల్గొన్నారు.

చోరీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఆశా వర్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చోరీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. చిన్నంవారిగూడెం గ్రామానికి చెందిన ఏలేటి రాణి అదే గ్రామంలో ఆశా వర్కర్‌గా పనిచేస్తుంది. ఈనెల 18న ఉదయం స్నానం చేసేందుకు బాత్‌రూంకు వెళ్లగా.. తిరిగి వచ్చి చూసే సరికి బీరువా తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించింది. వెంటనే బీరువా వెతకగా, బీరువాలో ఉంచిన 4 కాసుల బంగారం కనబడలేదని, దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఇంటి పక్కనే ఉన్న ఇద్దరిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదుతో పేర్కొన్నారని, ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కండక్టర్‌పై దాడి, కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఆర్టీసీ బస్సు కండక్టర్‌పై దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. జంగారెడ్డిగూడెం డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న కోనా ప్రసాద్ శనివారం మధ్యాహ్నం జంగారెడ్డిగూడెం – తాడేపల్లిగూడెం సర్వీస్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో జంగారెడ్డిగూడెం నుంచి కొయ్యలగూడెం వెళ్లేందుకు బస్సు ఎక్కిన జల్లి ప్రవీణ్‌కుమార్‌ను టిక్కెట్ అడిగారు. కండక్టర్ టిక్కెట్‌కు సరిపడా చిల్లర ఇమ్మని ప్రవీణ్‌కుమార్‌కు సూచించారు. దీంతో ప్రవీణ్‌కుమార్ కండక్టర్‌ను దుర్భాషలాడుతూ క్యాష్‌బ్యాగ్ లాక్కొని, కొట్టడంతో పాటు, బస్సులోని రాడ్డుకు కండక్టర్‌ను కొట్టాడు. దీంతో కండక్టర్‌కు గాయాలయ్యాయి. కండక్టర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



కిటకిటలాడుతున్న గుబ్బల మంగమ్మ సన్నిధి

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, మచిలీపట్నం, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వాహనాలతో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చేతల్లిగా వరాలిచ్చే అమ్మగా పేరుపొందడంతో మంగమ్మగుడికి వచ్చే భక్తుల సంఖ్య ప్రతీ వారం పెరుగుతూనే ఉంది. ఈ నెల 14 నుంచి 16 వరకూ అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా జరిగాయి. దర్శనానికి సుమారు 3 గంటల సమయం పట్టింది. క్యూలో నిలుచున్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

26న ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళా

కైకలూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఆటపాక వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 26న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత ఆదివారం చెప్పారు. జాబ్‌మేళాలో ఫోర్డ్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, కైకలూరు నేషనల్ స్కూల్, నవతా రోడ్డు ట్రాన్స్‌పోర్టు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. సుమారు 160 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు కలిగి 18–35 సంవత్సరాల వయస్సు కలిగిన యువత అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9701357315, 6281119575 నెంబర్లతో పాటు టోల్ ఫ్రీ నంబరు 9988853335లో సంప్రదించవచ్చన్నారు.

నాటు సారా రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్ట్

చింతలపూడి: నాగిరెడ్డిగూడెం గ్రామ శివారులో ఆదివారం తెల్లవారుజామున నాటుసారా రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. చాట్రాయి మండలం కొత్తగూడెంకు చెందిన ముల్లంగి శ్రీనివాసరావు, ముల్లంగి రామేశ్వరం బైక్‌పై నాటుసారా రవాణా చేస్తుండగా 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేసినట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, జె.జగ్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృద్ధుల ఇంటికి వైద్య సేవలు



వృద్ధుల ఇంటి వద్దకు వెళ్లి సేవలు అందిస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధుల ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందించారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ప్రత్యేక వాహనంలో తణుకు, సూర్యారావుపాలెం ప్రాంతాల్లో పర్యటించి ఐదుగురు వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించారు. సూరపనేని సత్యనారాయణరావు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ఉచిత వైద్యసేవల కోసం 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అందే సత్యం సేవలు మరువలేనివి



మాజీ చైర్మన్ అందే సత్యం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, కేంద్ర సహాయ మంత్రి

అత్తిలి: మండలంలోని స్కిన్నెరపురంలో ఏర్పాటు చేసిన దివంగత మాజీ జెడ్పీ చైర్మన్ అందే సత్యనారాయణ విగ్రహాన్ని ఆదివారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ గ్రామాభివృద్ధే ధ్యేయంగా అందే సత్యం సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, జెడ్పీటీసీ అద్దాల జానకి, సర్పంచ్ అద్దాల భాను లలిత మహాలక్ష్మి, ఐనంపూడి శ్రీదేవి, నార్ని తాతాజీ, బూరగడ్డ వేదవ్యాస్, మంతెన రామరాజు, తమ్మాబత్తుల సత్యనారాయణ, బాలం మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు వైఎస్సార్‌సీపీ ప్రాధాన్యం



కొట్టు సత్యనారాయణను కలిసిన యుగంధర్

తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలో మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను ఆదివారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కోడె యుగంధర్, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కోడె విజయలక్ష్మి, భీమవరం పట్టణాధ్యక్షుడు రామరాజులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ మహిళల రక్షణకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేశారన్నారు. అందరితో మమేకమై జిల్లాలో మంచి కార్యక్రమాలు చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పట్నాల గణపతి, కట్టా రవి, బొత్స ధర్మ తదితరులు పాల్గొన్నారు.

గణితంపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థుల ప్రిపరేషన్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో

పెంటపాడు: విద్యార్థులు గణితంపై పూర్తి అవగాహన పెంచుకొని సోమవారం జరిగే పరీక్షకు పూర్తి సన్నద్ధం కావాలని మండల విద్యాశాఖ అధికారి టీవీ రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం ఆయన పెంటపాడు ప్రభుత్వ బేసిక్ స్కూల్‌లో పదో తరగతి లెక్కల పరీక్ష కోసం సిద్ధమవుతున్న విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పదో తరగతి పరీక్షల కోసం విద్యార్థులు ఎలా సిద్ధమవుతున్నారో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. లెక్కలంటే భయం లేకుండా పరీక్షను రాయాలని ఈ సందర్భంగా కోరారు. వారిని పరీక్షలకు సిద్ధం చేయిస్తున్న మ్యాథ్స్ ఉపాధ్యాయుడు శశికపూర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. హెచ్‌ఎం రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాల దరఖాస్తులకు గడువు పెంపు

నరసాపురం: వివిధ కార్పొరేషన్‌ల ద్వారా మంజూరు చేసే స్వయం ఉపాధి రుణాల కోసం చేపట్టిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ గడువును ఈ నెల 25 వరకు ప్రభుత్వం పొడిగించిందని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

సూర్య ప్రతాపం.. బెంబేలెత్తుతున్న జనం



పెంటపాడు: ప్రత్తిపాడు వద్ద జాతీయరహదారిపై ఎండ తీవ్రతతో నిర్మానుష్యంగా ఉన్న రహదారి



తణుకులో ఎండ తాకిడికి నిర్మానుష్యంగా మారిన రాష్ట్రపతి రోడ్డు

- గొడుగులు, క్లాత్‌లు చుట్టుకుని ప్రయాణాలు
- నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు

తణుకు అర్బన్: వేసవికాలం ఎండవేడి దంచేస్తుండడంతో రహదారుల్లో ప్రయాణికులు అల్లాడిపోతున్నారు. వేడి వాతావరణం మార్చిలోనే రావడంతో పాటు ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతుండడంతో తణుకు పట్టణంలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఇళ్లలోనే ఉండలేకపోతున్న తరుణంలో ఎండ తగులకుండా పాదచారులు గొడుగులు వేసుకుని నడుస్తుండగా, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు తల, ముఖానికి క్లాత్ చుట్టుకుని వెళుతున్నారు. రోజురోజుకీ ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు.

పెరిగిన ఎండ

పెంటపాడు: పెరుగుతున్న ఎండ తీవ్రతతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గత రెండు రోజుల నుంచి గ్రీష్మతాపానికి ప్రజలు అల్లాడుతున్నారు. ఇంకా వేసవి తీవ్రత రాకపోయినా ఇదే తీవ్రమైన వేసవిలా వాతావరణం తలపిస్తోంది. ఇంకా రానున్న రోజులు ఎలా గడపాలో, ఏ విధంగా ఉండాలో తెలియడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. దీనికి తోడు రాత్రి సమయాల్లో దోమల బెడద, ఉక్కపోత అధికంగా ఉంటుంది. తీవ్రమైన ఎండలో దోమలు ఉండే ఛాన్స్ లేదు. కాగా రాత్రి సమయంలో దోమలు, చలి, మంచు ఉంటోంది. ఉదయం ఎనిమిది దాటితే ఎండ ప్రతాపం కనిపిస్తోంది. మండుటెండలకు వృద్ధులే కాదు, పిల్లలు, పెద్దలు అట్టుడుకుతున్నారు. ఉదయం 10 గంటలకే ఇళ్లకు చేరుకొని మధ్యాహ్నం 3 గంటల వరకు బయటకు రాని పరిస్థితి నెలకొంది. తెల్లవారు జాము నుంచి 8 గంటల వరకు వాతావరణం ఒకలా ఉంటే, అక్కడి నుంచి భానుడు భగభగ మంటున్నాడు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు పనులపై బయటకు వెళ్లిన వారు 11 గంటల లోపు ఇళ్లకు చేరుకుంటున్నారు. ఈ సారి వేసవి ముందే వచ్చిందా అన్నట్లు పరిస్థితి మారింది. ఒంటపూట బడులు ఏర్పాటు చేసినా విద్యార్థులు ఈ ఎండలకు తాళలేకపోతున్నారు.



తణుకులో మండుటెండకు తలపాగాతో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వృద్ధుడు



తణుకులో ఎండవేడి తగలకుండా ముఖానికి క్లాత్ చుట్టుకుని ద్విచక్ర వాహనంపై వెళుతున్న మహిళ

ఏప్రిల్ నుంచి ధాన్యం కొనుగోళ్లు



వరిచేలను పరిశీలిస్తున్న జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి

తాడేపల్లిగూడెం రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని మోదుగ గుంట గ్రామంలో వరి చేలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దాళ్వాలో ఆరు లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు. ధాన్యం సొమ్ములను 48 గంటల్లో రైతు ఖాతాల్లో సొమ్ములు జమ చేస్తామన్నారు. బ్యాంకు అకౌంట్లలో తప్పు ఉంటే సరి చేసుకోవాలని సూచించారు. వాట్సప్ యాప్ ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని, రైతులు వారు ఎప్పుడు కోస్తారో ఎప్పుడు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తారన్నది యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చన్నారు. క్విక్ రెస్పాన్స్ కంట్రోల్ టీంలు ఏర్పాటు చేసి, రైతులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ పి.మురళీకృష్ణ, ఏవో ప్రసాద్, తహసీల్దార్ సునీల్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్, తదితరులు పాల్గొన్నారు.

ఒంటిపూట బడులు అమలు చేయలేరా ?

- మండుటెండ, ఉక్కపోతకు పాఠశాలల్లో అల్లాడుతున్న చిన్నారులు
- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు

తణుకు అర్బన్: విద్యాశాఖ ఉదాసీనత, ప్రైవేటు విద్యాసంస్థల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వం ప్రకటించిన ఒంటిపూట బడుల ఉత్తర్వులు అమలు కావడంలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ముందుగానే వేసవి ఎండలు తీవ్ర రూపం దాల్చుతుండడంతో ఉక్కపోత వాతావరణంతో చిన్నారులు పాఠశాలల్లో అరకొర వసతుల మధ్య నలిగిపోతున్న దుస్థితి. ఈనెల 15వ తేదీ నుంచి పాఠశాలలకు ఒంటిపూట బడులు నిర్వహించాలని, ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మాత్రమే పాఠశాలలు నిర్వహించాలని ప్రభుత్వం ప్రకటించినా విద్యాశాఖ అధికారుల అశ్రద్ధకారణంగా పాఠశాలలకు ఉదయాన్నే వస్తున్న చిన్నారులు సాయంత్రం వరకు మగ్గిపోవాల్సి వస్తుందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, విద్యాశాఖ అధికారులు కుమ్మక్కై చిన్నారుల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు.



తణుకు డీవైఈవో కార్యాలయం

ఒంటిపూట బడుల వ్యవహారం గోప్యం

వేసవి దృష్ట్యా ప్రభుత్వం ఒంటిపూట బడులకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాలు విద్యాశాఖ అధికారులు గోప్యంగా ఉంచారని, గతంలో మాదిరిగా ఎటువంటి ప్రకటన చేయలేదంటూ పలువురు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు రాజకీయ ఒత్తిడి తీసుకువచ్చి రెండు పూటలా పాఠశాలలు నిర్వహిస్తూ విద్యార్థుల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా వసతులు లేవని కనీసం ఫ్యాన్‌లు కూడా అమర్చకుండానే పాఠశాలలు నిర్వహిస్తూ ఉక్కపోత వాతావరణంలో విద్యార్థులు అలసిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై తణుకు డీవైఈవో మురళీ సత్యనారాయణను సాక్షి వివరణ కోరగా అన్ని పాఠశాలలకు ఒంటిపూట బడులు నిర్వహించాలని ఆదేశాలిచ్చామన్నారు. పదో తరగతి పరీక్షల దృష్ట్యా పరిశీలించలేకపోయామని వెంటనే పాఠశాలలన్నింటికీ నోటీసులు పంపించనున్నట్లు చెప్పారు.

అనాథల ఆకలి తీరుస్తూ..



పులిహోర తింటున్న చిన్నారులు



ఉచితం బోర్డుతో అల్పాహారం అందిస్తున్న వైనం

ఉచితంగా అల్పాహారం, మజ్జిగ పంపిణీ

తణుకు అర్బన్: ఇంత సహాయం చేసి అంత హడావుడి చేసే నేటి రోజుల్లో తణుకుకు చెందిన ఒక అజ్ఞాత వ్యక్తి తనెవరో తెలియకుండా ప్రజలకు సాయం అందించాలనుకున్నాడు. వేసవి కారణంగా ప్రయాణికుల దాహార్తితో పాటు ఆకలిని కూడా తీర్చాలనుకుని ఒక వృద్ధ దంపతులను ఎంచుకుని వారి ద్వారా ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. తణుకు పట్టణంలోని రాజీవ్ చౌక్ సెంటర్‌లో గత కొన్ని రోజులుగా ఒక నాలుగు చక్రాల బండికి ఉచితం అని బోర్డు తగిలించి ఉండడాన్ని చూసి ప్రయాణికులు బండి ముందు ఆగుతున్నారు. బండి వద్ద రెడీగా ఉన్న పట్టణంలోని భాష్యం స్కూలు ప్రాంతంలో నివాసముంటున్న సరిదే జగన్‌మోహిని, వెంకటేశ్వరరావు దంపతులు ఆగిన వారికి పులిహోర, దద్దోజనం ఉందమ్మా మీకు ఏం కావాలి అంటున్నారు. ఆలోచిస్తున్న వారికి మీరు డబ్బులు ఏమీ ఇవ్వనవసరం లేదు మీకు కావాల్సింది ఉచితంగా తినొచ్చని చెబుతుండడంతో ఆహా ఏమి రుచి అంటూ లాగించేస్తున్నారు. తిన్న తరువాత చల్లని మజ్జిగ అందిస్తున్న ఆ దంపతులను కృతజ్ఞతగా చూసి వెళుతున్నారు. జగన్‌మోహిని సాక్షితో మాట్లాడుతూ తణుకుకు చెందిన ఒక సేటు ఈ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నారని, ప్రతి రోజూ ఉదయం మా ఇంటి వద్ద ఆహారం తయారు చేసుకుని తీసుకొచ్చి ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం చేస్తున్నామని చెబుతున్నారు. అయితే ఖర్చయ్యే ప్రతి రూపాయి మా సేటుదేనని తన పేరు ఎవరికీ చెప్పొద్దన్నారని సమాధానమిచ్చారు. ఈ నెల 3వ తేదీ నుంచి ఈ నాలుగు చక్రాల బండి ద్వారా ప్రయాణికుల దాహం, ఆకలి తీర్చడమే కాకుండా ఈ వయస్సులో మాకు కూడా ఉపాధి చూపారని ఆ సేటు సేవలను కొనియాడారు.

దొమ్మేటి వెంకటరెడ్డికి ఘన నివాళి



దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న శెట్టిబలిజ సంఘ నాయకులు

అత్తిలి: యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమైన జీవితం గడిపిన దొమ్మేటి వెంకటరెడ్డి అడుగుజాడల్లో యువత నడుచుకోవాలని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు దొమ్మేటి వెంకటరెడ్డి 172వ జయంతిని పురస్కరించుకుని అత్తిలి గ్రామంలో ఆదివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలో ఒక వ్యవసాయ కుటుంబంలో జన్మించిన వెంకటరెడ్డి 18వ శతాబ్దంలో బర్మా దేశం వెళ్లి అక్కడ తెలుగు సోదరులు పడుతున్న కష్టాలు తెలుసుకుని వారిని ఐక్యం చేసి స్వయం కృషితో ఎదిగి ఎందరికో ఉపాధి మార్గం చూపి బర్మా కేసరిగా పేరుగాంచారని కొనియాడారు. కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు కడలి రామాంజనేయులు, సంఘ నాయకులు మట్టపర్తి శ్రీను, బొంతు నాగార్జున, కుడుపూడి భాస్కరరావు, పంపన బుజ్జి, రాంపండు, కడలి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ సమావేశం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని అప్పారావుపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ సమావేశం ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేయాలన్నారు. రాబోయే కాలంలో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు శక్తి వంచన లేకుండా పాటుపడాలన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. అనంతరం గ్రామ కమిటీని నియమించారు. పార్టీ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ కనుపూరి ఉదయభాస్కర్, నాయకులు సిర్రాపు శాంతకుమార్, మాధవ్, అడపా విష్ణు, అడపా హరిబాబు, పాతపాటి సత్తిరాజు, షేక్ లాలు పాల్గొన్నారు.

ఉగాది ఉత్సవాలు ప్రారంభం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ ఆలయం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీవిశ్వావసు నామ ఉగాది సంవత్సర ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయం వద్ద గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, రజకలచే అమ్మవారి గరగల సంప్రోక్షణ, అమ్మవారికి విశేష అర్చనలు జరిగాయి. వైద్యులు కొండ్రెడ్డి శశికుమార్, డాక్టర్ శైలజ దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు శ్రీరంగం అంజి కార్యక్రమాలను పర్యవేక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు పార్కు వద్ద అమ్మవారికి పొంగళ్లు

ఉగాది మహోత్సవాల సందర్భంగా ఈ నెల 24వ తేదీ సోమవారం పాతూరు బలుసులమ్మ అమ్మవారి పుట్టింటి పార్కు పాశం వారి ఇంటి వద్ద పొంగళ్ల కార్యక్రమం నిర్వహించనున్నారు. తొలుత పాతూరులో అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తారు. ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

విప్లవ వీరుల ఆశయ సాధనకు కృషి చేయాలి



తాడేపల్లిగూడెం (టీఓసీ): భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏఐఎస్‌ఏ నాయకులు



ఇరగవరం: కాగడాల ప్రదర్శన చేస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ ఆశయాల సాధనకు విద్యార్థులు, యువత కృషి చేయాలని అల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్‌ఏ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి అన్నారు. ఈ దేశానికి స్వాతంత్ర్యం రావడానికి కృషి చేసిన భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏఐఎస్‌ఏ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అప్పలస్వామి మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ జీవిత విశేషాలను, బ్రిటిష్‌వారు అన్యాయంగా ఉరి తీసిన సంఘటలను వెల్లడించారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో ఘోరంగా విఫలం చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే సీపీఐ కార్యాలయంలోని కపర్ది భవనంలో కామ్రేడ్ భగత్ సింగ్ 94వ వర్ధంతిని నిర్వహించారు. ఎం.షణ్ముక్, ఎం.భార్గవ, వై.రితేష్, వి.చరితవ్య, ఎం.తనూజ, కె.అరుణ పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం

తణుకు అర్బన్: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల జీవిత చరిత్ర నేటి యువతకు ఆదర్శమని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్‌ఏ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి అన్నారు. ఈ మేరకు భగత్‌సింగ్, రాజ గురు, సుఖ దేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా ఆదివారం తణుకు వేల్పూరు రోడ్డులో భగత్ సింగ్ విగ్రహానికి మాజీ విద్యార్థి నాయకులు తానేటి అమృత్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం తణుకు నియోజకవర్గ అధ్యక్షుడు గోపె ఎడ్వర్డ్ పాల్, ఏఐఎస్‌ఏ నాయకులు వి.సుశాంత్, టి.నేహల్, కె.గణపతి, ఎం.గణేష్, బి.చందు, సీహెచ్ సాయి, ఎం.జోసఫ్, యు.గణేష్, తదితరులు పాల్గొన్నారు.



తణుకు అర్బన్: భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన విద్యార్థి సంఘాల నాయకులు

సీపీఎం ఆధ్వర్యంలో..

ఇంకిలాబ్ జిందాబాద్ అంటూ ఆంగ్లేయుల నుంచి భారతదేశ విముక్తి కోసం నినదించిన భగత్ సింగ్ యువతకు స్ఫూర్తిదాయకమని సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ళ చిన వీరభద్రరావు, పార్టీ సీనియర్ నాయకులు కర్నాటపు నరసింహారావు అన్నారు. ఆదివారం స్వాతంత్ర సమరయోధులు భగత్ సింగ్, సుఖదేవ్ రాజ్‌గురుల 94వ వర్ధంతిని సీపీఎం వేల్పూరు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మినీ బైపాస్ రోడ్‌లో భగత్ సింగ్ సెంటర్ వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో వాసా వెంకటేశ్వరరావు, దున్నే నాగేశ్వరరావు, ఒంటెద్దు బసవరాజు, యండమూరి నాగేంద్ర, లంకె నారాయణ, కుడకా వీరభద్రరావు, విశ్వనాథం సుబ్బారావు, కరేళ్ల అర్జున్, తాళ్ల సత్యనారాయణ, అందే కోట బసవయ్య పాల్గొన్నారు.

కాగడాల ప్రదర్శన

ఇరగవరం : మండలంలోని తూర్పు విప్పర్రులో సీపీఐ నాయకులు సంకు అప్పారావు భవనం వద్ద సర్దార్ భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం కాగడాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించారు. మండల కార్యదర్శి నామన వెంకటేశ్వరరావు, అద్దాల సత్యనారాయణ, గిద్దా సూర్యనారాయణ, తిరుమలశెట్టి చంటి, చిక్కాల బ్రహ్మాజీ, కాటూరి రాముడు, గాలింకి వెంకటేశు, ఉదిసి రామోజీ, గుడిమెట్ల కోటేశ్వరరావు, తదితతరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ (మీకోసం) కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈమేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటలు నుంచి అందించాలని కోరారు.